జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శుక్రవారం | 29 | మే | 2026 ◆ పేజీలు : 5



## బోనకల్ తహసిల్దార్ కి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి



**బోనకల్, మే 28 (ప్రజా జ్యోతి )** బోనకల్ మండల తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న మద్దెల రమాదేవి నల్లగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ చేశారు. బోనకల్ మండలంలో తహసిల్దార్ గా ఆమె సమన్వయంతో, బాధ్యతా యుతంగా విధులు నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన రైతుల సమస్యల పరిష్కారంలో వేగవంతం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇచ్చారు. భూ సమస్యల సంబంధిత అంశాలు, రైతుల పాస్బుక్ సమస్యలు వంటి అనేక అంశాల్లో బాధ్యత గా వ్యవహరించి మండల ప్రజల ప్రశంసలు అందుకు న్నారు. ఆమె సేవలను పలువురు అభినందించారు. ఉన్నత బాధ్యతలు చేపడుతున్న మద్దెల రమాదేవికి మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.




# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మోడల్ సోలార్ గ్రామాల పథకంలో తొలి విడతగా రాష్ట్రంలో 81 గ్రామాల ఎంపిక
- పీక్ డిమాండ్ 18,542 మెగావాట్లకు చేరినా కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా
- తడిసిన 9214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు
- కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి తెలంగాణలో ధాన్యం కొనుగోలు
- తెలంగాణ కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్ సీఐ ద్వారా కేంద్రం తీసుకోవాలి
- బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో వ్యవసాయ పంప్ సెట్ లకు ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్ ప్రారంభించి డిప్యూటీ సీఎం భట్టి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**బోనకల్, మే 28(ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో మోడల్ సోలార్ గ్రామాల పథకంలో భాగంగా వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన 7.5 కిలోవాట్ సోలార్ ప్లాంట్లను ఎన్ పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీనీ ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రంలో మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం క్రింద రాష్ట్రంలో తొలి విడతలో 81 గ్రామాలను ఎంపిక చేసి ప్రతి గృహానికి 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లు, వ్యవసాయ మోటార్లకు 7.5 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను మొత్తం 1380 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు.ఖమ్మం జిల్లాలో 27 గ్రామాల

మిగతా 2 లో...

## పేదల సంక్షేమ పథకాల ఆద్యుడు తారక రాముడు ఎమ్మెల్యే రాగమయి



### ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**సత్తుపల్లి మే28 (ప్రజాజ్యోతి)** విశ్వవిఖ్యాత, నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 జయంతి వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి,ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని, రాజకీయాలలో తనదైన ముద్ర వేసినారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని నిరుపేదల కోసం కిలో బియ్యం రెండు రూపాయలు ప్రవేశపెట్టిన మహనీయుడని, నిరుపేదల ఆకలి తీర్చేందుకే వారికి కడుపునిండా అన్నం పెట్టేందుకు ఈ పదకో ఎంతగానో ఉపయోగపడిందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా రిజర్వేషన్,మహిళలకు సమానంగా ఆస్తి హక్కు, తెలుగు భాష పై ప్రత్యేకత ఉండాలని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తెలుగు భాష అమలు, శాంతి భద్రతల కోసం

మిగతా 2 లో...

# నేను చనిపోలేదు... బ్రతికే ఉన్నాను...

- పింఛన్ కోసం వెళితే చంపేశారు
- విచారణ లేకుండానే డెత్ సర్టిఫికెట్ నమోదు
- ఒకే ఊరిలో ఇద్దరు పరిస్థితి



**రఘునాథపాలెం ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల కేంద్రానికి చెందిన 75 ఏళ్ల కొండ్రు రాములమ్మ నేను చనిపోలేదు బ్రతికే ఉన్నాను నా భర్త కొండ్రు రాములు రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడు. భర్త చనిపోవడంతో ప్రభుత్వ నుండి వచ్చే వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న రాములమ్మ రెండు సంవత్సరాలుగా

మిగతా 2 లో...

## మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం...



- కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం
- గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఎస్సీ కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపు
- ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** మధిర నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్ పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి రహదారులు, విద్యుత్ సబ్ స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుసగా శంకుస్థాపనలు చేశారు.ముందుగా ఎర్రుపాలెం మండలం గోసవీడు గ్రామంలో" 2 కోట్ల 80 లక్షలతో గోసవీడు నుండి రామకృష్ణాపురం వరకు

మిగతా 2 లో...

## పేదల సంక్షేమ పథకాల ఆద్యుడు తారక రాముడు ఎమ్మెల్యే రాగమయి

(మొదటి పేజీ తరువాయి...)

కొత్త పోలీస్ విధానం,పేదలకు ఉచిత విద్య,ఆరోగ్యం ప్రభుత్వ ఉద్యోగాలలో పెన్షన్ బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధికి ప్రాధాన్యత అందించిన మహనీయుడనీ, ఆయన జయంతి వేడుకలు జరుపుకోవటం అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు కమల్ పాషా, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, చల్లగుండ్ల నరసింహారావు, కృష్ణయ్య, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, తెలుగు దేశం నాయకులు, నందమూరి అభిమానులు విరివిగా పాల్గొన్నారు.

## ....నేను చనిపోలేదు బ్రతికే ఉన్నాను






(మొదటి పేజీ తరువాయి...)

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న దగ్గర నుండి పింఛను వస్తుందేమో అని ఆశగా ఎదురుచూస్తుంది. కార్యాలయాల్లో కలిసిన ప్రతి నాయకుడిని అధికారులను వేడుకుంది. ఎవరు పట్టించుకోలేదు, రాములమ్మ కి ఇద్దరు కొడుకులు పెళ్లిళ్లయి వేరు వేరు కాపురాలు పెట్టి ఫోను పనులు చేస్తే జీవనం సాగిస్తున్నారు. రాములమ్మ మనవడు ఇటీవల ఆన్లైన్లో ఎందుకు పింఛన్ రావడంలేదని విచారించగా రాములమ్మ మరణించినట్లుగా ఉందని మీ సేవలో ఎవరు దరఖాస్తు చేయకున్న మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు, రేషన్ బియ్యం కూడా నిలిపివేసి అధికారులకు చేతులు దులుపుతున్నారు. బ్రతికుండగానే చంపేశారుఅంటూ అధికారులను కలవగా పింఛన్ స్టేటస్ లో డెత్ గా నమోదయి ఉందని దీంతో బ్రతికి ఉండగానే చంపేశారు సారు అని అక్కడ ఉద్యోగులను కాళ్ల వెళ్ళబడి బ్రతిమిలాడుకుంది. ఇది ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం లో మండల పరిషత్ కార్యాలయానికి పింఛన్ కోసం వచ్చిన వృద్ధ మహిళకు జరిగిన అన్యాయం. రఘునాధపాలెం మండలంలో వృద్ధాప్య వితంతు దివ్యాంగులకు ప్రభుత్వం కి వేలాది మంది దరఖాస్తులు చేసుకుంటే అధికారులు ఆన్లైన్ లోనే నమోదు చేయలేదంటే నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలానికి చెందిన కొండ్రు రాములమ్మ బ్రతికి ఉండగానే చంపేసి పింఛన్ రాకుండా చేసారు. దరఖాస్తు చేసుకున్న దగ్గర నుండి పింఛన్ కోసం ఎదురుచూస్తున్న రాములమ్మకి చావు కబురు చల్లగా చెప్పారు. కళ్ళ ముందు పెన్షన్ రాలేదని కనబడుతుంటే నువ్వు చనిపోయావంటూ చేతిలో పెట్టడం తో ఒక్కసారిగా ఆందోళనకు గురైంది రాములమ్మ. ఇదే విషయమై దావాలంగ గ్రామంలో ప్రవహించడంతో బ్రతికున్న రాములమ్మని ఎలా చంపుతారు అంటూ గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన కొమ్ము పుల్లయ్య పుల్లమ్మ అనే వృద్ధ దంపతుల్లో పుల్లమ్మ గత ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందింది కానీ పుల్లమ్మకి బదులు పుల్లయ్య చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్లు పుల్లయ్య కూడా ఐదు సంవత్సరాలుగా తెలిసిన కోసం తిరుగుతుండగా అధికారుల వద్దకు వెళ్ళితే స్టేటస్ లో పని చనిపోయినట్లుగా ఉందని చెప్పడంతో ఒక్కసారి. ఇలా జరగడానికి అధికారులు తప్పిదమా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది తప్పిదమా ఏది ఏమైనాప్పటికీ వీరిద్దరు కూడా పింఛన్కు అర్హులు అనేది గ్రామస్తులు కరాకండిగా చెప్తున్నారు. వెంటనే దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎంపీడీవో వివరణ....** ఇక ఒకే గ్రామంలో ఇద్దరికీ పెన్షన్ కోసం అప్లై చేసుకున్న వారికి డెత్ సర్టిఫికెట్లు మంజూరు కావడంతో స్థానిక ఎంపీడీవో అశోకుని వివరణ కోరెందుకు ఫోన్లో అందుబాటులోకి రాలేదు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి...)



పరిధిలో 445 కోట్ల వ్యయంతో 16,837 గృహాలు, 4,371 వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.నాణ్యమైన విద్యుత్ సరఫరా ద్వారా వ్యవసాయం, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని, తద్వారా రాష్ట్ర పురోగతి వేగవంతంఅవుతుందని పేర్కొన్నారు.2023-24లో రాష్ట్ర పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం అది 18,542 మెగావాట్లకు చేరుకుందని, కేవలం రెండున్నర సంవత్సరాల్లో 3 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ పెరిగినా ఎక్కడా చిన్న అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు.విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి పెంపు, అదనపు లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టడం వల్ల విద్యుత్ గ్రిడ్ ఎక్కడా కుప్పకూలకుండా సరఫరా జరుగుతోందన్నారు. పీక్ డిమాండ్ ఎంత పెరిగినా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, అంచనాలకు మించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.అకాల వర్షాల కారణంగా కొన్నిచోట్ల ధాన్యం తడిసినా ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9214 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని గుర్తించి చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేస్తామని, ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకోకుండా ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు మార్లు కేంద్ర పౌరసరఫరాల మంత్రితో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కలిసి తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్ సీఐ ద్వారా స్వీకరించాలని కోరినా సానుకూల స్పందన రాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంలో భారత ఆహార సంస్థ కేవలం సగం మాత్రమే కొనుగోలు చేస్తోందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా భాజపా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ 2025-26లో కేంద్ర ప్రభుత్వం 60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఇవ్వగా తెలంగాణ ప్రభుత్వం 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. రబీ సీజన్ లో కేంద్రం 51.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మరో 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిప్యూటీ సీఎం డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల తెలంగాణ ప్రభుత్వం రైతులకు 17 వేల కోట్లు మద్దతు ధర కింద చెల్లించిందన్నారు. గత పాలకులు 2014 నుంచి 2023 వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, గత రెండున్నర సంవత్సరాల్లో తమ ప్రభుత్వం ఎంత కొనుగోలు చేసిందో లెక్కలతో సహా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, మహానేత వైఎస్సార్ ఈ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడం వల్ల ప్రతి రైతు 20 వేల నుంచి 25 వేల వరకు లాభపడ్డారని తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, 2 లక్షల 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించడం జరిగిందన్నారు. చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కొంత మేరకు పెండింగ్ లో ఉందని, మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. ధాన్యం రవాణా కోసం ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సీరియల్ నెంబర్ వారీగా లారీలను పంపిస్తూ రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ధాన్యం రవాణా కోసం డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రెడ్కో ఎండీ అనిల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎన్ పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)



నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో గోసవీడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 2 కోట్లతో రామన్నపాలెం నుండి కట్లేరు చెరువు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఇనగాలి గ్రామంలో 6 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సైదెల్లిపురం వరకు, 3 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సిద్దినేని గూడెం వరకు నిర్మించనున్న బిటీ రోడ్డు నిర్మాణ పనులకు, 31 లక్షలతో ఇనగాలి ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ములుగుమాడు గ్రామంలో కోటి 29 లక్షలతో చేపట్టిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, ములుగుమాడు నుండి నాగవరప్పాడు వరకు 3 కోట్ల 75 లక్షలతో,ములుగుమాడు నుండి సైదేల్లిపురం వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ములుగుమాడు ఎస్సీ కాలనీలో 63లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.తక్కెలపాడు గ్రామంలో 4 కోట్ల 50 లక్షలతో తక్కెళ్ళపాడు నుండి మధిర ఆర్ అండ్ బి రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 69 లక్షలతో తక్కెల పాడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.పెద్ద గోపవరం గ్రామంలో 132/33 కేవీ ఎర్రుపాలెం సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, జమలాపురం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేసారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌళిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ప్రధాన రహదారులతో పాటు మారుమూల గ్రామాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌళిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌళిక వసతుల కల్పన పనులు చేపట్టడం జరిగిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద స్వశక్తి మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, సబ్ స్టేషన్ల ఏర్పాటుతో స్థానిక రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం మాస్టర్ ప్లాన్

- మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన
- రెండు, మూడు నెలలలో ప్రభుత్వం కు మాస్టర్ ప్లాన్ ప్రతిపాధనలు
- ఉమ్మడి ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, మాజీ డీజీపీ సీ.ఆంజనేయరెడ్డి



**నేలకొండపల్లి, మే 28 ప్రజా జ్యోతి :** స్థానిక బౌద్ధక్షేత్రం కు ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం అభివృద్ధి చేసేందకు మాస్టర్ ప్లాన్ ను సిద్ధం చేస్తున్నట్లు మాజీ డీజీపీ, ఉమ్మడి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ సి. ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధి కోసం చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి క్షేత్ర స్థాయిలో పరిశీలనకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు గురువారం బౌద్ధక్షేత్రం ను. సందర్శించారు. బౌద్ధక్షేత్రం ఆవరణ అంతా కలియతిరిగారు. త్వరలో చేపట్టనున్న మాస్టర్ ప్లాన్ కు అవసరమైన వాటి గురించి చర్చించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు...బౌద్ధక్షేత్రం ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రం గా తీర్చిదిద్దేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగం ను అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతుందన్నారు. బౌద్ధస్థూపం'తొలుత ఎలా ఉందో అదే రూపంలో తయారు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. పర్యాటకుల కు మౌళిక వసతులు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్ ను తయారు చేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తి స్థాయిలో పరిశీలన చేసి రెండు, మూడు నెలలో ప్రభుత్వం కు మాస్టర్ ప్లాన్ ప్రతిపాధనలను అందించనున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా ఎన్టీఆర్ఐ సహాకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా భూగర్భంలో దాగి ఉన్న చారిత్రక ఆవశేషాలను శాస్త్రీయంగా వెలికి తీసి కాపాడాలన్నారు. అలాగే పర్యాటక వసతుల కోసం నాలుగు ఎకరాల భూమి ని సేకరించాలని సూచించారు. పర్యాటక చరిత్ర ను తెలిపే విధంగా ఆధునిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.2.50 కోట్ల నిధులు మంజూరు కాగా వాటికి త్వరలోనే శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. దశల వారీగా కాకుండా అభివృద్ధి ని ఏక కాలంలో అభివృద్ధి చేసుకునేలా మాస్టర్ ప్లాన్ ' ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్రావు, డిప్యూటీ డైరెక్టర్ నరసింగ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు "కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, మైశా శంకర్, కుక్కల హనుమంతరావు, కడియాల నరేష్, వేగినాటి లక్ష్మినర్సయ్య. యర్రబోయిన నర్సయ్య, బుర్రా లింగరాజు, మోర మల్లయ్య, కోడిరెక్క వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ 2026గా మిస్ట్ విద్యార్థి సల్మా



**సత్తుపల్లి మే28(ప్రజా జ్యోతి)**స్థానిక మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం ఏఐ, ఎం ఎల్ విభాగంలో విద్యనభ్యసిస్తున్న షేక్. సల్మా గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ – 2026గా తమ కళాశాల నుండి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరి కృష్ణ తెలియజేశారు.గూగుల్ కంపెనీ వారు దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించిన ఆన్లైన్ ఇంటర్వ్యూలో మిస్టు అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ ఆఫ్ మిస్టు –2026 గా ఇంటెన్షిప్ కి ఎంపికైనది.ఈ విద్యార్థిని మిస్టు అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ విభాగాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు గూగుల్ సంస్థ ప్రతినిధిగా గూగుల్ జెమినీ ప్రత్యేకతలను, దానిని సరైన క్రమంలో విద్యార్థిని, విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలో వర్క్ షాపులను నిర్వహించి వారికి వివరించి, దానితోపాటు ఏఐ ఫీచర్స్ ను కూడా విద్యార్థులకు వివరించారు.ఈ వర్క్ షాప్స్ ను కళాశాలలో సమర్థవంతంగా ఉపయోగించుకున్న విద్యార్థిని మరియు విద్యార్థులకు గూగుల్ జెమినై స్టూడెంట్ అంబాసిడర్ తరపున సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఈ సర్టిఫికెట్లు విద్యార్థులకు భవిష్యత్తులో జాబ్ రెజూమ్ కి ఉపయోగపడతాయి.గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్– 2026 గా ఎంపికైన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్, మదర్ తెరిసా విద్యాసంస్థల ప్రెసిడెంట్ చలసాని సాంబశివరావు , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. వి. రామచంద్రరావు, సిఎస్సి విభాగాధిపతి శ్రీ పి. మారేశ్వర్ రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు బోధ నేతర సిబ్బంది అభినందించారు.

## రాజ్యసభ సభ్యుల రేణుక చౌదరి నిధులతో సిసి రోడ్ పనులు ప్రారంభం



**కారేపల్లి, మే 28, ప్రజాజ్యోతి:** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీలో రాజ్యసభ సభ్యులు మాజీ కేంద్రమంత్రి గారపాటి రేణుక చౌదరి నిధులతో గుగులోత్ బిచ్చ ఇంటి నుండి ఆలోత్ రాందాస్ ఇంటి వరకు నాలుగు లక్షల రూపాయలతో సిసి రోడ్ పనులను భాగ్యనగర్ తండ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గూగులోతు బీక్కు లాల్ నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో అభివృద్ధి కొరకు రాజ్యసభ నిధులు నుండి సిసి రోడ్ కేటాయించినందుకు రేణుక చౌదరికి కృతజ్ఞతలు తెలిపినారు. పంచాయతీలో అనేక రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని మరిన్ని నిధులు కేటాయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వరి నందరాజు, పోలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ బద్రునాయక్, వార్డు సభ్యులు గుగులోత్ నాగేష్, తేజావత్ భూలి, భూక్య కిషన్ నాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూగులోతు హర్ష నాయక్, గుగ్గులోత్ వీరన్న, తారాచంద్, రాందాస్, బిచ్చ, ఆలోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని హ్యాండ్ పంపుల మరమ్మతులు




**కారేపల్లి, మే 28, ప్రజాజ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అప్పాయిగూడెం, బిక్యాతండ, తులిస్య తండా గ్రామంలో రిపేర్ లో ఉన్న హ్యాండ్ పంపుల మరమ్మతులు సర్పంచ్ దండు ప్రవీణ్,కార్యదర్శి బి. కృష్ణవేణిల ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా భిక్య తండా గ్రామంలో గల తిరుపతమ్మ గుడి ఆవరణలో ఉన్న హ్యాండ్ పంపు మొదటగా రిపేర్ చేయటం జరిగింది.తర్వాత గ్రామంలో పనిచేయని అన్ని హ్యాండ్ పంపుల రిపేర్ చేయటం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు త్రాగు నీటి సమస్య లేకుండా చూడటమే ప్రధాన లక్ష్యం, రానున్న రెండు రోజులో గ్రామ పంచాయతీ లో రిపేర్ లో ఉన్న అన్ని హ్యాండ్ పంపుల మరమ్మతులు జయించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు.నీటి సరఫరా కోసం తీసుకున్న ప్రత్యేక చొరవకు గ్రామ ప్రజలు, తిరుపతమ్మ గుడి అర్చకులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణిని సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు వాంకుడోత్ రమేష్, అజ్మీరా మమత, మాలోత్ విజయ, బోర్ మెకానిక్ మోహన్ రావు, గ్రామ పంచాయతీ సిబ్బంది సత్యం,శ్రీను గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి గుడిపూడి తిరుమల రావు వితరణ



**కారేపల్లి, మే 28, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి గ్రామానికి చెందిన గుడిపూడి తిరుమల రావు (ఎన్నారై) అప్పాయిగూడెం గ్రామపంచాయతీ తులస్యా తండా గ్రామములో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం పదివేల 16 రూపాయల వితరణ చేసినారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సపావట్ నాగులు మాట్లాడుతూ గుడి నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరగానే సహాయం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు, వారి కుటుంబానికి ఆంజనేయ స్వామి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గేటుకారేపల్లి మాజీ ఉపసర్పంచ్ వల్లభనేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఖమ్మంలో మహానాడు విజయవంతం

- రెండవ రోజు టీడీపీ శ్రేణులతో దద్దరిల్లిన మహానాడు సభ ప్రాంగణం
- మహిళల ఆటపాటలతో కోలాటాల ముత్యాల సందళ్లతో ముగింపు సభ

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతిసారి ప్రారంభించే మహానాడు కార్యక్రమం జరపడం ఆనవాయితీ ఈసారి భారత ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్, వినియోగం తగ్గించే ప్రక్రియ ఆచరించాలని ప్రకటనతో మహానాడు ను ఈసారి వర్చువల్ స్క్రీన్ మీద ఎక్కడి వారు అక్కడే వీక్షించాలని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు, దానిలో భాగంగానే ఖమ్మం జిల్లాలో భారీ ఎత్తున ప్రారంభమై, మూడు రోజుల మహానాడు ను రెండు రోజులకు కుదించడం వల్ల రెండు రోజుల ఈ కార్యక్రమం మొదటిరోజు రెండవ రోజు ఘనంగా ముగింపు జరిగింది,టిడిపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకే మహానాడు ను ఖమ్మంలో ఏర్పాటు చేయడం జరిగిందని దానికి పార్టీ శ్రేణులు ఎండలు మండుతున్న పెద్ద ఎత్తున హాజరై ఘనంగా విజయవంతం చేసినందుకు అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమ విజయవంతానికి టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు సిబ్బంది ఎంతగా శ్రమించి ఎవరికి వారు తమ సహాయాన్ని అందించి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కాపా క్రిష్ణ మోహన్, కేతినేని హరీష్, వనమా వాసు, కొండబాల కర్ణాకర్, వడ్డేం విజయ్, తాత సుధాకర్, మల్లెంపాటి అప్పారావు,మందడపు సుధాకర్,వాసిరెడ్డి భాస్కరరావు,గుత్తా సీతయ్య,మీగడ రామారావు,అరెం వరలక్ష్మి, రాజరాజేశ్వరి,ఝాన్సీ,మేకల సత్యవతి, వక్కంతుల వంశీ, నున్న నవీన్, కన్నీటి పృథ్వి, కూచిపూడి జై, నాగార్జున శ్రీను,మురళి,మహిళా నాయకురాళ్లు,డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గ్రామ, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## టిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా షేక్ యూసుఫ్ ఖాన్ నియామకం



**వైరా మే 28 ప్రజా జ్యోతి** తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ విద్యార్థి విభాగం వైరా నియోజకవర్గ అధ్యక్షులుగా షేక్ యూసఫ్ ఖాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఖాన్ ఒక ప్రకటనలో తెలియజేస్తూ, గతంలో తాను వైసిపి, కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగాలలో చురుకైన పాత్ర పోషించానని, చెప్పారు. ఇప్పుడు కవితమ్మ కొత్త పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడినై, టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ గౌరవరపు జగదీష్ నాయకత్వం నచ్చి, పార్టీలో చేరానని తెలిపారు. తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్షులు గట్టు కరుణ, రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్, సమక్షంలో పార్టీ ఇంచార్జ్ జగదీషన్న తనను వైరా నియోజకవర్గ విద్యార్థి విభాగం పదవికి ఎంపిక చేశారని పేర్కొన్నారు. పార్టీ నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, విద్యార్థిని, విద్యార్థులను భారీ సంఖ్యలో పార్టీలో చేరుస్తానని తెలిపారు. యువత పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే విధంగా ఆర్గనైజేషన్ చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పదవి ఇచ్చి గౌరవించిన జగదీషన్నకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, తనకు ఈ పదవి బక్రీద్ గిఫ్ట్ గా భావిస్తున్నానని తెలిపారు. యూసఫ్ ఖాన్ తో పాటు వైరా టిఆర్ఎస్ అధ్యక్షులు గున్నాల సురేష్ గౌడ్, కార్మిక విభాగం అధ్యక్షులు కన్నెగంటి రవి, కొండ, మధు, పానుగంటి సురేష్ ఉన్నారు.

## ఆర్ఎస్ఎస్ వాళ్ళు మతం పేరు దేవుడు పేరు చెప్పి విద్య ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారు

- **కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్**



**చింతకాని మే28ప్రజాజ్యోతి ప్రతినిధి:** హేతువాదం నాస్తికత్వం అంటే సామాన్య ప్రజలకి అర్థం కాదు. 90 శాతం ప్రజలకి లాజిక్ గా ఆలోచించే శక్తి ఉండదు.అందుకే మూఢ నమ్మకాలని త్వరగా నమ్ముతారు.ప్రజల యొక్క ఈ అమాయకత్వాన్ని ఆసరా గా చేసుకొని ఆర్ఎస్ఎస్ వాళ్ళు మతం పేరు,దేవుడి పేరు,దేశభక్తి పేరు చెప్పి ప్రజలకి విద్య , ఉద్యోగాలు లేకుండా చేసి దోచుకుంటున్నారు.కుల వ్యవస్థ ని సృష్టించి ,యే కులాలు అయితే శ్రమ చేసి ఉత్పత్తి చేస్తున్నారో వారిని తక్కువ కులాలు అని చెప్పి అవమానిస్తున్నారు.జనాభా ఎక్కువ ఉన్న ఈ కులాల వాళ్ళ వద్ద సంపద ,భూములు , అధికారం రాజకీయ పదవులు లేకుండా చేసి వాళ్ళని అణచి వేస్తున్నారు.మతం మత్తులో ముంచి ప్రజల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు.మనువాదం మరియు సనాతన ధర్మం పేరుతో 90శాతం జనాభా ని పేద వాళ్ళుగా చేస్తున్నారు.బానిసలుగా మారుస్తున్నారు.ఎందరో తమ ప్రసంగాలు ,రచనలు,పాటలు , మాటల ద్వారా ఎంత చెప్పినా ఈ సామాన్య ప్రజలకి అర్థం కావట్లేదు ఇంకా.ప్రజలు హేతువాదులుగా మారినప్పుడే ఇండియా అభివృద్ధి చెందుతుంది,ప్రజలు బాగుపడతారు.

## బిఆర్ ఎస్ నేత బాల్క సుమన్ పై కేసు నమోదు

- **కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు**

**సత్తుపల్లి మే28(ప్రజా జ్యోతి )**భవనాలు కూల్చండి, ఆఫీసులు కూల్చండి, రైల్వే పట్టాలు కోసేయండి అని ప్రజలను రెచ్చగొడుతూ ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ విధ్వంసాలు జరిగేలా ఘాటు వ్యాఖ్యలు చేసిన బి.ఆర్.ఎస్ నాయకుడు బాల్క సుమన్ పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్లో సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో సత్తుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కి ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహా రావు, గొర్లమారి రామ్మోహన్ రెడ్డి,సత్తుపల్లి పట్టణ కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చెత్తకు నిప్పు పెట్టడంతో తప్పిన భారీ ప్రమాదం

- **172 మొక్కజొన్న బస్తాలను కాపాడిన బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం**
- **ఇంకెంతకాలం రోడ్ల పక్కనే పంటలు?..**
- **రైతుల ప్రాణాలతో చెలగాటం ఆపాలి**
- **అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ఆగ్రహం**





**బోనకల్, మే 28(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోనిబోనకల్ – వత్సవాయి ప్రధాన రహదారిలో గురువారం పెద్ద ప్రమాదం తప్పింది. రహదారి పక్కన ఉన్న పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించి సమీపంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న బస్తాల వరకు చేరుకున్నాయి. అక్కడ నిల్వ ఉంచిన సుమారు 172 మొక్కజొన్న బస్తాలు మంటలకు ఆహుతయ్యే పరిస్థితి నెలకొని భారీ ప్రమాదం తప్పింది. సమయానికి మొక్కజొన్నపంట రైతు యార్లగడ్డ వెంకటేశ్వర్లు అక్కడ లేకపోవడంతో అతనీ భార్య వెంకటేశ్వర్లకు సమాచారం ఇవ్వగా వెంటనే బోనకల్ గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండకు బాధిత రైతు వెంకటేశ్వర్లు వెంటనే బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ కు సమాచారం అందించి పరిస్థితిని వివరించారు . వెంటనే స్పందించిన ఉప సర్పంచ్ బానోతు కొండ హుటాహుటిన గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్తో ఘటనాస్థలికి చేరుకుని సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో భారీ నష్టం తప్పి రైతు పంట సురక్షితంగా నిలిచింది.ఈ సందర్భంగా రైతు యార్లగడ్డ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. “కొద్ది నిమిషాలు ఆలస్యమైతే మా ఏడాది శ్రమ బూడిదయ్యేదని , వెంటనే స్పందించి పంటను కాపాడిన ఉపసర్పంచ్ బానోతు కొండతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గానికి జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంగా తెలిపారు. ఘటన అనంతరం ఉపసర్పంచ్ బానోతు కొండ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, రహదారుల పక్కన , పొలాల వద్ద నిల్వ ఉంచిన మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉంచాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం అన్నారు. ఎండలు, అగ్నిప్రమాదాలు, అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ప్రభుత్వం , సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాంటావేసిన మొక్కజొన్న బస్తాలను లారీలు పంపి తరలించాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి. రైతు పంట రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే రహదారుల పక్కన చెత్తకు నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అజాగ్రత్త వల్ల రైతుల ఆస్తి నష్టం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. అదేవిధంగాఅగ్నికి ఆహుతైన కూరగాయల దుకాణం 20 వేలు అస్తి నష్టం జరిగిందని అన్నారు.ఇవే మంటలు వ్యాపించి అక్కడే కూరగాయల దుకాణం ఏర్పాటు చేసుకున్న బోనకల్ గ్రామానికి చెందిన గంగుల సత్యం అనే వ్యాపారస్తుడి కూరగాయలు దుకాణం డబ్బా కొట్టు కూడా పూర్తిగా దగ్ధమైనట్లు ఆయన తెలిపారు. మంటల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం అందించాలని ఉపసర్పంచ్ కొండ అధికారులను కోరారు. అదేవిధంగా గతంలో పంట అవశేషాలను కాల్చడంతో పక్కనే ఉన్న బోనకల్ గ్రామానికి చెందిన తెల్లాకుల శ్రీనివాసరావు కి సంబంధించిన శ్రీగంధం చెట్లు మంటలు వ్యాపించి కాలిపోయాయని వారికి కూడా తీవ్రంగా ఆస్తి నష్టం జరిగినట్లు వారు తెలిపారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, రైతు పంట భద్రతపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## కారేపల్లిలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**కారేపల్లి, మే 28, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లోని జామే మజీద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈద్గా వద్ద బక్రీద్ పండగ ( ఈదుల్ అజ్హా ) నమాజ్ అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్ పటేల్ మాట్లాడుతూ ఈ పండుగ ఉద్దేశం ప్రవక్త యొక్క త్యాగాలను మన అందరము ఆచరించాలని బోధించినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేధర వీర ప్రతాప్ టోని పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ షఫీ, షేక్ అబ్దుల్ మతీన్, షేక్ శంషుద్దీన్, మౌలానా అబ్దుల్ మజీద్, బాబు సార్, హనీఫ్, షేక్ తాజుద్దీన్, మహమ్మద్ నసీర్, సర్దార్, యాకుబ్ అలీ, నూరుల్ అతీక్, పారుఖ్, షేరు, ముజామిల్, మహమూద్ పాషా, ఖైరుద్దీన్, కబీర్, జావిద్, రియాజ్ పాల్గొన్నారు.

## 31 న ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

- **వేలాదిగా తరలిరండి: తాళ్లూరి రామారావు రజక సంఘం మండల అధ్యక్షులు**



**వేంసూరు,మే27 ప్రజాజ్యోతి** ఖమ్మంజిల్లా వేంసూరు మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఈ నెల 31 న ఉదయం 9;30 గంటలకు వీర తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ చేయనున్నట్లు మండల రజక సంఘం అధ్యక్షులు తాళ్లూరి రామారావు మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు.ఆవిష్కరణ కార్యక్రమంలో రజకులు,ప్రజాసంఘాల నేతలు,సామాజిక వాదులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని తాళ్లూరి పిలునిచ్చారు.ప్రకటన విడుదల చేసిన వారిలో తాళ్లూరి వెంకట కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ముస్లింలు ప్రదర్శన




**సత్తుపల్లి మే28(ప్రజా జ్యోతి )** ముస్లింల పండుగ బక్రీద్ సందర్భంగా స్థానిక మేరాజ్ మస్జిద్ సత్తుపల్లి వెంగళరావు నగర్ కాలనీ కి చెందిన ముస్లిం యూత్ సభ్యులు ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం, ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. భారతదేశంలో ఏ విధంగానైతే నెమలిని జాతీయ జంతువుగా ప్రకటించారో,అదేవిధంగా ఆవును జాతీయ జంతువుగా ప్రకటించి, దేశంలో ఆవులను కాపాడాలని ఈ సందర్భంగా తెలియజేశారు.గోరక్షణ పేరు తో అమాయకులపై జరిగే జరుగుతున్న దాడులను నివారించాలని, విదేశాలకు గోమాంసం ఎగుమతి చేసి కోట్లు దంటుకుంటున్న కంపెనీలను నిషేదించాలని, ముఖ్యంగా ఆవులను కాపాడాలని, డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ విరాట్ నగర్, జలగం నగర్ ద్వారకాపురి కాలనీ, గాంధీ నగర్ లకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఉచిత ప్రైవేట్ ఉద్యోగాల మేళా

- **ఉపాధికల్పన అధికాణి ఎన్ మాధవి**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు హైదరాబాద్ ప్రైవేటు రంగంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఈ నెల 30-05-2026 శనివారం ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ భవనంలో జాబ్ మేళా నిర్వహించబడుతోంది. యువతీ యువకులు టెన్త్,ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ ల తో సంప్రదించగలరని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్.మాధవి ఒక ప్రకటనలో తెలియజేశారు.వయోపరిమితి 21 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న యువతీ, యువకులు అర్హులు.అభ్యర్థులకు సొంతంగా ద్విచక్ర వాహనం తప్పనిసరిగా ఉండాలి.

# మధిరలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**మధిర ప్రజా జ్యోతి** స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయం లో తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామా రావు జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం లో పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పార్టీ జండా ఆవిష్కరణ,ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం ఈ ఏడాది లో టీడీపీ పార్టీకి ఎనలేని సేవలు అందించి మరణించిన నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిపాటి నిముషాలు మౌనం పాటించి ,పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి,పట్టణ తెలుగుదేశం పార్టీ ఆద్వర్యయంలో నిరవహించిన పులిహోర,మజ్జిగ పంపిణీ చేశారు,జిల్లా నాయకురాలు కోనేరు రాణి గారి ఆర్థిక సహాయం తో జిలుగుమాడులో ఉన్న నిస్సి హరిణి ఆశ్రమంలో వికలాంగులకు,వృద్ధులకు చీరెలు పంపిణీ పట్టణ పార్టీ ఆద్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లాది హనుమంతరావు,మార్నిడిపల్లారావు,ములకపల్లి వినయ్ కుమార్,(17వ వార్డు కౌన్సిలరు)చట్టు వెంకటేశ్వర్లు,(ప్రధాన కార్యదర్శి)మేడిపల్లి రాణి (రాష్ట్ర మహిళా కార్యదర్శి), చావా శివాజీ గారు,గద్దల ప్రకాశరావు ,మాదాలరసింహారావు,మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేశారు అని అన్నారు,వారుచేసిన జనరంజక పధకాలను గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయసాధనకై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు,లోకేశ్ గారు కృషి చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు, ఈ కార్యక్రమంలో మన్నేపల్లి రత్నకుమారి,జమ్ముల కోటేశ్వరావు,గద్దం మల్లికార్జున,సీనియర్ నాయకులు పాశం రామనాథం,వీరవల్లి కోటేశ్వరావు,వాసిరెడ్డి ఈశ్వరావు,పోతినేని కోటేశ్వరావు,నాగులవంచ శ్రీనివాసరావు,వేల్పుల కొండ,రావూరి రంగయ్య,వినుకొండ కృష్ణమూర్తి, గూడెల్లి నాగయ్య,కేశవపట్నం రామయ్య,తిరుపతి కృష్ణమూర్తి,చెన్నం స్వామి,బోనాల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## వంటావార్పులతో వివో ఏల నిరసన



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం వద్ద వివో ఏల నిరసన కార్యక్రమం కొనసాగుతూ ఉంది గురువారం విఓఏలు వంటా వార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేశారు గత 11 రోజుల నుండి వివోఏ లు విధులను బహిష్కరించి వారి ప్రాథమిక హక్కుల కోసం పోరాడుతున్నారు ప్రధానంగా వివోఏలు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్హులైన వారిని సీసీలుగా గుర్తించాలనీ పనికి తగ్గ వేతనం కల్పించాలని పని భారం తగ్గించాలని హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని వారూ డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష ఉపాధ్యక్షులు కనకదుర్గ రాణి హేమలత జ్యోతి సరోజిని ఏడుకొండలు సుజాత పద్మ దుర్గా భవ్య నాగమణి జ్యోతి సైదమ్మ వెంకటేశ్వరమ్మ నాగమణి కమలమహాలక్ష్మి పద్మజ పద్మ స్వర్ణ లత సూర్యకళ స్వప్న జ్యోతి రమణ స్వాతి వినాయకుమారి వజ్రకుమారి వరలక్ష్మీ త్రివేణి కనక దుర్గా కృష్ణవేణి కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీతో రాజ్యాంగానికే ప్రమాదం

- బ్రాహ్మణపల్లిలో సిపిఐ సభ్యత్వ కార్యక్రమం విజయవంతం
- సిపిఐ సభ్యత్వ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ

**బోనకల్, మే 28 (ప్రజా జ్యోతి ):** ప్రధాని మోడీతో రాజ్యాంగానికి ప్రమాదమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) సభ్యత్వం అనేది ఒక రాజకీయ అనుబంధం మాత్రమే కాదని, అది కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే ఒక చారిత్రక ఉద్యమంలో భాగస్వామ్యం అని అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసి గురువారం విజయవంతంగా ముగిసింది. దేశంలో సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో సాగించిన ప్రజాపోరాటాల ద్వారా సాధించిన విజయాల స్ఫూర్తితో భవిష్యత్లో ప్రజల హక్కుల కోసం పోరుబాటలో ముందుకెళ్తామని అన్నారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై సిపిఐ ఆవిర్భవించిందని తెలిపారు. భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. దేశంలో భూసంస్కరణలు, కార్మిక హక్కులు, అనే సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. పేదలు, దళితులు, మైనార్టీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రజల హక్కుల సాధన కోసం సిపిఐ నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులు నేటికి పూర్తిగా అమలుకావడం లేదని, నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల రాకముందు, అనంతరం మొత్తంగా పెట్రోల్, డిజిల్ 4 సార్లు పెంచి సామాన్యుల నడ్డివిరిచాడని ఎద్దేవా చేశారు. మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని, విభజన, విద్వేష రాజకీయాలలో బిజేపీ దేశ సమగ్రతకు సవాల్ గా మారిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం, కార్పోరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిపోయి దేశ సంపద కార్పోరేట్ల జేబుల్లోకి వెలుతుందన్నారు. ఆయా సమస్యలపై సిపిఐ నిర్మాణాత్మక ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీలో, సభ్యత్వం ద్వారా ఒక వ్యక్తి భావజాలం, సిద్ధాంతం, సమాజ మార్పుపై స్పష్టత పొందేందుకు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి గుడిద కృష్ణ, ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, సహాయ కార్యదర్శి చావా గోపాలకృష్ణ, మాజీ ఎంపిటిసి కొంగర రామారావు, సిపిఐ మండల నాయకులు మదుపల్లి వెంకటేశ్వర్లు, మందడపు కృష్ణయ్య, వంగాల హనుమంతరావు, పారుపల్లి నరసింహారావు, పారుపల్లి జోగారావు, గుడిద సత్యం తదితరులు పాల్గొన్నారు.



## పంట భద్రతపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- రైతులకు తప్పిన భారీ నష్టం
- అధికారులు రైతుల పంటను వెంటనే తమ కొనుగోలు కేంద్రాలకు తరలించాలి
- సర్పంచి మందా కరుణ, ఉప సర్పంచ్ చంద్రయ్య




**బోనకల్ ,మే 28(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని గోవిందపురం (ఎల్ ) గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో తమ కల్లాలలో ఉన్న మొక్కజొన్న బస్తాలు దగ్గరికి మంటలు రావడంతో వెంటనే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచి మందా కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, గ్రామస్తులతో కలిసి మంటలను అర్పించారు. హుటహుటిన గ్రామపంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే వాటర్ ట్యాంక్తో ఘటనాస్థలికి చేరుకుని వెంటనే ట్రాక్టర్ల ద్వారా తమ చేలో ఉన్న దంటును శుభ్రంగా చేపించి బయటికి తరలించారు. మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో భారీ నష్టం తప్పి రైతు పంట సురక్షితంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచి మందా కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, మాట్లాడుతూ...సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, రహదారుల పక్కన ఉన్న పొలాల వద్ద నిల్వ ఉంచిన మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నల్లమోతు నాగేశ్వరరావు, ఏడునూతల లక్ష్మణరావు, పసుపులేటి నరేష్, కారంగుల రాధ, తుళ్లూరు విమల, ద్రోనోజుల కోటేశ్వరరావు, బండి సతీష్, పుచ్చకాయల తిరపయ్య, బన్నీ కారంగుల కోటేశ్వరరావు గుంటూరు కోటయ్య, దొంతిబోయిన అచ్చయ్య, రావూరి నరేష్, పుచ్చకాయల బ్రహ్మం, శ్రీకాంత్, రంజాన్, షేక్ మస్తాన్, పంచాయతీ సిబ్బంది ఏసుపోగు ప్రకాశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు

- మరమ్మత్తులు చేపించిన తీర్లపురం గ్రామ సర్పంచ్



**చింతకాని మే 28 ప్రజాజ్యోతి ప్రతినిధి :** మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలో మే 27 తేదీన బుధవారం నాడు రాత్రి ఈదురుగాలుల – బీభత్సం తో వచ్చిన వర్షముతో మత్కేపల్లి నామవరం వెళ్లే రోడ్డుకు కరెంటు పోల్స్ విరిగిపడిన ఉన్న తీగలు తెగి రోడ్డు మీద అడ్డంగాపడటంవల్ల వాహనాలకు రాకపోకలు అంతరాయం కలిగినది. రోడ్లు ఇరువైపులా ఉన్న భారీ చెట్లు విరిగి రోడ్డు మీద పడి ఉన్నాయి. దీనితో తిర్లాపురం గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్ తీగలు తెగి రోడ్లపై పడటం అత్యంత ప్రమాదకరం. ఇలాంటి పరిస్థితిలో ప్రాణాపాయం జరగకుండా ఉండటానికి తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందజేసి అకాల వర్షాల కారణంగా విరిగిపడిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన తీగలను తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తక్షణమే స్పందించి మత్కేపల్లి నామవరం వెళ్లే రోడ్డుకు కరెంటు తీగలు, భారీ వృక్షాలు అడ్డంగా జెసిబి సహాయం తొలగించి వాహనాలు వెళ్లే విధంగా మరమ్మత్తులు చేయించారు. దీనివల్ల గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగి, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజల ఇబ్బందులను తొలగించి, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబుకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చేపల మడుగు వీరబాబు, నాగులవంచ ఏ ఈ సాయి శ్రీధర్, సామల రమేష్, విద్యుత్ కాంట్రాక్టర్ రామకృష్ణ సిబ్బంది, ఫ్రాన్సిస్,అన్వేష్, సీత రాములు,తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలుతో రైతులకు మద్దతు ధర, లాభదాయకము

**కారేపల్లి, మే 28, ప్రజా జ్యోతి :** కారేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషితో ఆయనకు రైతులపై ఉన్న అభిమానంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు మద్దతు ధర కల్పించటం జరిగిందని కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా మాధారంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా 803 మంది రైతులకు సంబంధించి రూ.11.94 కోట్ల విలువైన 49758.50 క్వింటాళ్ళ మొక్కజొన్నను కొనుగోలు చేయటం జరిగిందన్నారు. దీని ద్వారా రైతులకు రూ.2.99 కోట్లు లాభం చేకూరిందన్నారు. మొక్కజొన్న కొనుగోలు సంబంధించి ప్రభుత్వం పైకం విడుదల చేసిందని, త్వరలో రైతు ఖాతాలలో జమ కానున్నాయని తెలిపారు. సొసైటీ రుణ వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ చేసినట్లు తెలిపారు. రైతులు తప్పని సరిగా వడ్డీలు చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రుణాల రెన్యూవల్ చేసుకోవటం ద్వారా రుణమాఫీ, పావలా వడ్డీ రాయితీ పొందవచ్చన్నారు. బకాయిల వసూళ్లకు ఇప్పటికే న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే బకాయిదారులకు నోటీసులు ఇవ్వటం జరిగిందన్నారు. రికవరీ సెక్షన్ ద్వారా రుణ వసూళ్లకు జప్తులు, తనఖా పెట్టిన భూములపై జెండాలు పెట్టి స్వాదీనంకు చర్యలు జరుగుతున్నాయన్నారు. రైతు సోదరులు సొసైటీని వినియోగించుకోవటం ద్వారా అర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. కార్యదర్శి బోల్లు హనుమంతరావు, డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, కొత్తూరి రామారావు, సిబంది తదితరులు పాల్గొన్నారు.